పాక్ వెళ్లి మరీ మట్టుబెడతం

ఉగ్రవాద చర్యలను సహించం

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: పక్క దేశం నుంచి ఎవరైనా వచ్చి భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినా, దేశంలో శాంతి భద్రతలకు భంగం కలిగించినా ఊరుకునేది లేదని, వారికి తగిన జవాబు ఇస్తామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులను ఏరివేసే ప్రణాళికలో భాగంగా పాకిస్థాన్‌లో భారత గూఢచార సంస్థలు దాదాపు 20 మందిని మట్టుబెట్టాయని బ్రిటన్‌కు చెందిన 'ది గార్డియన్' పత్రికలో వచ్చిన వార్తపై రాజ్‌నాథ్ శనివారం స్పందించారు. ఈ వార్త అవాస్తవమని, భారత్‌కు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే, ఎవరైనా భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడి పాకిస్థాన్‌లోకి పారిపోతే మాత్రం ఊరుకోమని, ఆ దేశంలోకి వెళ్లి మరీ మట్టుబెడతామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ చెప్పినట్టుగా భారత్ సామర్థ్యాన్ని పాకిస్థాన్ కూడా అర్థం చేసుకోవడం ప్రారంభించిందన్నారు.

పీవోకే ప్రజలు భారత్‌లో కలుస్తామంటున్నారు

ఇరుగుపొరుగు దేశాలతో సత్సంబంధాలను నెరపాలనేది భారత్ విధానమని, భారత్ ఒక్కసారి కూడా ఇతర దేశాలపై దాడి చేయలేదని, ఇతర దేశాల భూభాగాల్లో ఒక్క అంగుళాన్ని కూడా ఆక్రమించలేదన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు భారత్‌లో కలుస్తామని డిమాండ్ చేస్తున్నారని, ఈ మేరకు పలు ప్రదర్శనలు నిర్వహించారని రాజ్‌నాథ్ తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌దేనని స్పష్టం చేశారు. కాగా, సింగ్ వ్యాఖ్యలకు పాకిస్థాన్ కౌంటర్ ఇచ్చింది.

లేహ్‌లో సరిహద్దు ర్యాలీ విరమణ

వాంగ్‌చుక్

లేహ్: గత ఐదేండ్లలో చైనా భారత్ భూభాగాన్ని పెద్దమొత్తంలో ఆక్రమించుకొన్నదని వాంగ్‌చుక్ ఆరోపించారు. లడఖ్‌కు స్వయం ప్రతిపత్తి కోరుతూ ఆందోళనకారులు ఆదివారం వాస్తవధీన రేఖ వెంబడి చాంగ్‌తాంగ్ వరకు 'పష్మినా(సరిహద్దు) ర్యాలీ' నిర్వహించాలనుకొన్నా.. చివరి నిమిషంలో దాన్ని విరమించుకొన్నారు. పోలీసులు, ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి వద్దనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు లేహ్ అపెక్స్ బాడీ తెలిపింది. అయితే శాంతియుత ఆందోళనను కొనసాగిస్తామని చెప్పింది. అంతకు ముందు ఈ ర్యాలీపై స్థానిక యంత్రాంగం ఆంక్షలు విధించింది. ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ర్యాలీలు నిర్వహించకూడదని ఆదేశిస్తూ లేహ్ జిల్లా మేజిస్ట్రేట్ 144 సెక్షన్ విధించారు. ఈ నేపథ్యంలో ప్రముఖ పర్యావరణ కార్యకర్త వాంగ్‌చుక్ శనివారం ఒక వీడియో సందేశం విడుదల చేశారు. లడఖ్‌వాసులు దాదాపు లక్షా 50 వేల చదరపు కిలోమీటర్ల భూమిని భారత కార్పొరేట్లకు కోల్పోయారని తెలిపారు. లేహ్‌ను వార్ జోన్‌గా మార్చారని అధికార యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుత ఆందోళనను హింసాత్మకంగా మార్చి, తర్వాత లడఖ్‌వాసులను దేశ వ్యతిరేకులుగా ముద్ర వేయాలని కుట్రలు చేస్తున్నారని పేర్కొన్నారు.

యూఎస్‌లో మరో భారత విద్యార్థి మృతి

న్యూఢిల్లీ: అమెరికాలో భారతీయ విద్యార్థుల వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా ఓహియో రాష్ట్రంలో ఒకరు మరణించారని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ శుక్రవారం పేర్కొన్నది. భారతీయ లేదా భారత సంతతికి చెందిన విద్యార్థులు మృతిచెందిన ఘటనల్లో ఈ ఏడాదిలో ఇది పదోది కావడం గమనార్హం. కాగా, విద్యార్థి మృతికి గల కారణం తెలియరాలేదని, దర్యాప్తు జరుగుతున్నదని తెలిపింది. మృతుడిని గద్దె ఉమా సత్యసాయిగా గుర్తించారు. ఇతను క్లెవెలాండ్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్నాడు. సత్యసాయి మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కాన్సులేట్.. విద్యార్థి మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు పంపేందుకు చర్యలు తీసుకొంటున్నట్టు తెలిపింది.

'రాజ' మకుటం ఎవరిదో?

- రసవత్తరంగా రాజస్థాన్‌లో లోక్‌సభ ఎన్నికలు
- మూడోసారి క్లీన్‌స్వీప్ చేయాలని బీజేపీ ప్రయత్నం
- బూత్ లెవల్ క్యాడరే కమల దళం బలం
- మీనా, గుర్జార్స్, జాట్ వర్గాల నుంచి సెగ లేకపోలేదు
- ఆరెల్పీ, బీఏపీ, సీపీఎంతో ఎన్నికల బరిలోకి కాంగ్రెస్
- గెహ్లోట్, పైలట్ చరిష్మాను నమ్ముకొన్న హస్తం పార్టీ
- వెంటాడుతున్న గత పాలన అవినీతి, పేపర్ లీక్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉండే రాజకోటల రాజధాని రాజస్థాన్‌లో ఈ నెలలోనే రెండు దఫాల్లో (19న, 26న) లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరుగనున్నది. 2004లో నాలుగు సీట్లకు పరిమితమైన కాంగ్రెస్.. 2009కి వచ్చేసరికి 20 స్థానాల్లో విజయదుందుభి మోగించింది. అయితే, ఆ తర్వాత జరిగిన రెండు లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఖాతా కూడా తెరువలేకపోయింది. ఇదే సమయంలో 2014, 2019లో దాదాపు అన్ని లోక్‌సభ స్థానాలను క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీ.. హ్యాట్రిక్ విజయాన్ని దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నది.

కాంగ్రెస్ బలాలు - బలహీనతలు

- మాజీ సీఎం అశోక్ గెహ్లోట్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌ల చరిష్మా
- గుర్జార్ కమ్యూనిటీ నుంచి బలమైన సపోర్ట్ ఉండటం
- ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని దూరం చేశామంటూ ప్రజల్లో సానుభూతి
- రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆరెల్పీ), భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ), సీపీఎంతో జట్టు
- గెహ్లోట్, పైలట్ వర్గం మధ్య ఆధిపత్య పోరు
- పార్టీ వ్యవస్థీకృత నిర్మాణం, బూత్ స్థాయి క్యాడర్ బీజేపీతో పోలిస్తే మెరుగ్గా లేకపోవడం
- గడిచిన ఐదేండ్ల పాలనలో అవినీతి ఆరోపణలు, పేపర్ లీకుల వ్యవహారం
- మాజీమంత్రి మహేంద్రజీత్ సింగ్ మాలవీయ వంటి కీలక నేతలు పార్టీని విడిచిపెట్టడం

బీజేపీ బలాలు - బలహీనతలు

- పార్టీ వ్యవస్థీకృత నిర్మాణం, బూత్ స్థాయివరకూ బలమైన క్యాడర్ ఉండటం
- గడిచిన రెండు దఫాల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడం
- అసమ్మతి సెగ తగిలిన సిట్టింగ్ ఎంపీలను పోటీలో నుంచి తప్పించి కొత్తవారికి ఇవ్వడం
- ప్రధాని మోదీ తరుచూ రాష్ట్రంలో పర్యటించడం.
- ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచి పార్టీ అధికారంలోకి రావడం
- పేపర్ లీక్ కేసులో దర్యాప్తును ముమ్మరం చేసి పలువురిని అరెస్ట్ చేయడం.
- టికెట్లు రాని ఆశావహులు కాంగ్రెస్‌లోకి మారిపోవడం.. ఉదాహరణకు చురు ఎంపీ రాహుల్ కాస్వాన్‌కు టికెట్ నిరాకరించడంతో ఆయన కాంగ్రెస్‌లోకి చేరడం.
- తమ వర్గానికి ప్రాతినిధ్యం లేదంటూ మీనా, గుర్జార్స్, జాట్ తదితర వర్గాల నుంచి అసమ్మతి సెగ
- పంజాబ్ రైతులతో కలిసి ఉత్తర రాజస్థాన్‌కు చెందిన రైతులు పలు సమస్యలపై నిరసనలు వ్యక్తం చేయడం



గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

సంవత్సరం	కాంగ్రెస్	బీజేపీ
2019	00	25
2014	00	25
2009	20	04
2004	04	21
1999	09	16

రాజ్యసభ ఎంపీగా నడ్డా ప్రమాణం

న్యూఢిల్లీ: రాజ్యసభకు ఎన్నికైన ఆరుగురు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణం చేసిన వారిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మహారాష్ట్రకు చెందిన అశోక్‌రావ్ చవాన్, రాజస్థాన్‌కు చెందిన చున్నీలాల్ గరాసియా, తెలంగాణకు చెందిన అనిల్‌కుమార్ యాదవ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుస్మితా దేవ్, అహ్మద్ నడిముల్ హక్ ఉన్నారు.

ఒక్కొక్కరూ 15 కోట్లకు అమ్ముడుపోయారు!

ధర్మశాల: హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ కుట్రలు చేసిందని రాష్ట్ర సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు అన్నారు. ఆరుగురు కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలు, ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు రూ.15 కోట్లకు చొప్పున అమ్ముడుపోయారని శుక్రవారం ఆరోపించారు. కాగా, సుఖు వ్యాఖ్యలను ఖండించిన రెబల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ శర్మ.. సీఎంకు పరువు నష్టం నోటీసు పంపినట్టు శుక్రవారం పేర్కొన్నారు.

'నారీశక్తి' మాటలకే!

బీజేపీ లోక్‌సభ టికెట్లలో మహిళలకు 16 శాతమే

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లును తీసుకొచ్చామని చెప్పుకొనే బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల టికెట్ల కేటాయింపులో మాత్రం మహిళలపై చిన్నచూపు చూసింది. ఆ పార్టీ ఇప్పటి వరకు ప్రకటించిన 417 మంది అభ్యర్థుల్లో మహిళలు కేవలం 68 మంది(16 శాతం) మాత్రమే కావడం ఇందుకు నిదర్శనం. ఇందులోనూ 40 మంది రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారే. వీరిలోనూ రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల రాజకుటుంబాలకు చెందిన వారికే కమలం పార్టీ ప్రాధాన్యమిచ్చింది.

కేజ్రీవాల్‌కు మద్దతుగా నేడు నిరాహారదీక్షలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఈ నెల 7న ప్రపంచవ్యాప్తంగా నిరాహారదీక్షకు దిగాలని ఆమ్‌ఆద్మీ పార్టీ పిలుపునిచ్చింది. భారత్ సహా కెనడా, యూకే, యూఎస్ తదితర దేశాల్లోని భారతీయులు దీక్ష చేయనున్నారని ఆప్ నేతలు చెప్పారు.

సిసోడియా కస్టడీ పొడిగింపు

ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఆప్ నేత, మనీష్ సిసోడియా జ్యూడీషియల్ కస్టడీని కోర్టు ఈ నెల 18 వరకు పొడిగించింది. సిసోడియాకు ఇదివరకు విధించిన జ్యూడీషియల్ కస్టడీ గడువు పూర్తవ్వటంతో ఆయన్ను కోర్టు ముందు హాజరు పర్చారు.

అనుమతి కోరితే దూషించారు!

ఎన్నికల అధికారులపై ఆప్ ఆరోపణ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హర్యానాలో ఆదివారం తమ పార్టీ రెండు రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకోనేందుకు ఈసీకి చెందిన సువిధ పోర్టల్‌లో అనుమతి కోరగా.. అందుకు అధికారులు దుర్భాషలాడుతూ తిరస్కరించారని ఆప్ ఆరోపించింది. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం శనివారం హర్యానా ఎన్నికల ప్రధాన అధికారిని నివేదిక కోరినట్టు ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. కైథాల్ ఏఆర్‌వో యూజర్ ఐడీని గుర్తు తెలియని వ్యక్తులు దుర్వినియోగం చేశారని అధికారులు తెలిపారు. కాగా, సంబంధిత ఏఆర్‌వోను గవర్నర్ శనివారం సస్పెండ్ చేశారు.

కంగనాపై మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: 'రాజకీయ నేతగా మారిన నటి కంగనా రనౌత్ గొడ్డు మాంసం తిన్నారు.. ఇష్టపడ్డారు. బీజేపీ ఆమెకు మండీ టికెట్ ఇచ్చిందంటూ' మహారాష్ట్ర కాంగ్రెస్ నేత విజయ్ వాడెట్టివార్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేత షైనా ఎన్‌సీ తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు ఆమె తాను మాట్లాడిన వీడియోను ఎక్స్‌లో షేర్ చేశారు. పాతకాలం నాటి ఆలోచనలతో కాంగ్రెస్ నేతలు ఇలాంటి హాస్యాస్పదమైన వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటి సారి కాదన్నారు.

లావోస్ ఉద్యోగ బాధితులు స్వదేశానికి

న్యూఢిల్లీ: ఆకర్షణీయమైన ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పినవారి వలలో పడి మోసపోయిన 17 మంది భారతీయులు తిరిగి స్వదేశానికి బయల్దేరినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం తెలిపారు. వీరిని స్వదేశానికి రప్పించేందుకు లావోస్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులు చేసిన కృషిని ప్రశంసించారు.

గాజాపై ఓటింగ్‌కు భారత్ దూరం

కాల్పుల విరమణ పాటించాలని ఐరాస తీర్మానం

న్యూయార్క్: పాలస్తీనాతో జరుగుతున్న యుద్ధంలో గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్‌ను నిలువరించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. గాజాలో మానవ హక్కుల హననం జరుగుతున్నదన్న ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో గాజాలో కాల్పుల విరమణ పాటించాలంటూ ఐక్యరాజ్య సమితిలోని మానవ హక్కుల మండలి తీర్మానం చేసింది. గాజాస్ట్రిప్‌లో అక్రమ నిర్బంధాన్ని ఎత్తివేయాలని ఆ తీర్మానంలో కోరింది. ఈ సందర్భంగా జరిగిన ఓటింగ్‌కు భారత్, ఫ్రాన్స్, జపాన్, నెదర్లాండ్స్, రొమేనియా సహా 13 దేశాలు దూరంగా ఉన్నాయి.

సహజీవన సఖి

మనోవర్తికి అర్హురాలే

పెండ్లి చేసుకోకున్నా ఆ హక్కు ఉంటుంది: ఎంపీ హైకోర్టు

భోపాల్: సుదీర్ఘ కాలం సహ జీవనం చేసిన స్త్రీ, పురుషులు విడిపోయిన తర్వాత, వారిద్దరూ చట్టబద్ధంగా పెండ్లి చేసుకోకపోయినప్పటికీ, మనోవర్తి పొందేందుకు ఆ మహిళకు హక్కు ఉంటుందని మధ్య ప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. శనివారం ఓ కేసు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పిటిషనర్ శైలేష్ బోప్చే (38), ప్రతివాది అనిత బోప్చే (48) చాలా కాలం నుంచి సహ జీవనం చేస్తున్నారు. వీరిద్దరూ ఓ బిడ్డకు జన్మనిచ్చారు. వీరిద్దరూ విడిపోయిన తర్వాత అనితకు నెలకు రూ.1,500 చొప్పున పోషణ భత్యం చెల్లించాలని శైలేష్‌ను ట్రయల్ కోర్టు ఆదేశించింది. దీనిపై శైలేష్ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు తీర్పు చెప్పూ, శైలేష్, అనిత భార్యాభర్తలుగానే చాలా కాలం జీవించారని, అనిత శైలేష్‌ను చట్టబద్ధంగా వివాహం చేసుకున్నట్లు ట్రయల్ కోర్టు నిర్ధారించలేకపోయిందని, అయితే ఆమెకు పోషణ భత్యం చెల్లించాలని ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పులో పొరపాటు లేదని స్పష్టం చేసింది.

భర్తకు దూరమవడం క్రూరత్వమే: ఢిల్లీ హైకోర్టు

తన భర్త వల్ల ఎటువంటి తప్పు లేకపోయినప్పటికీ, భర్త నుంచి వేరుగా ఉండటం కోసం భార్య ఇంటి నుంచి పదే పదే వెళ్లిపోవడం మానసిక క్రూరత్వమేనని ఢిల్లీ హైకోర్టు చెప్పింది. పరస్పర సహకారం, విధేయత, విశ్వాసం, అంకిత భావంగల చక్కని వాతావరణంలో వివాహ బంధం వర్ధిల్లుతుందని, దూరంగా ఉండటం, వదిలిపెట్టడం వల్ల ఈ బంధం చక్కదిద్దడానికి వీల్లేని విధంగా దెబ్బతింటుందని అభిప్రాయపడింది. ఓ కేసు లో భర్తకు భార్య నుంచి విడాకులు మంజూరు చేసింది. ఆమె అతనిపట్ల మానసిక క్రూరత్వా న్ని ప్రదర్శించినట్లు నిర్ధారించింది. తన భార్య తనను దాదాపు ఏడు మార్లు విడిచిపెట్టిందని భర్త ఆరోపించారు. ఆమె మనసు స్థిరంగా ఉండదని చెప్పారు. వీరిద్దరికీ విడాకులు మంజూరు చేయడానికి తిరస్కరిస్తూ కుటుంబ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును హైకోర్టు రద్దు చేసింది.

స్త్రీ శారీరక బంధానికి తెలిపే సమ్మతి భ్రమతో కాదు

ఓ సహజీవనం కేసులో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : మహిళ వివేకంతో ఆలోచించి, పర్యవసానాల గురించి తెలిసి, ఓ పురుషునితో శారీరక సంబంధం ఏర్పాటు చేసుకుంటే, ఆమె అతనిని అపార్థం చేసుకోవడం వల్ల లేదా భ్రమతో ఈ సమ్మతి తెలిపిందని చెప్పలేమని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. పెళ్లి చేసుకుంటానని ఆ వ్యక్తి తప్పుడు వాగ్దానం చేసినట్లు స్పష్టమైన సాక్ష్యాధారాలు లేనిదే, ఆమె అతనిని అపార్థం చేసుకోవడం వల్ల అతనితో శారీరక సంబంధం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పలేమని పేర్కొంది. తనతో సహ జీవనం చేసిన వ్యక్తి తనను వివాహం చేసుకుంటానని తనపై అనేకసార్లు లైంగిక దాడి చేసినట్లు ఆరోపిస్తూ మహిళ పెట్టిన రేప్ కేసును కొట్టివేసింది.

స్టడీ పర్మిట్లపై కెనడా భారీ కోత

- **భారత విద్యార్థుల ఆశలపై నీళ్లు**

ఒట్టావా: భారతీయ విద్యార్థుల ఆశలపై కెనడా ప్రభుత్వం నీళ్లు చల్లింది. 2024లో స్టడీ పర్మిట్లకు భారీగా కోత విధించేందుకు సిద్ధమైంది. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యపై పరిమితి విధించనున్నామని ఆ దేశ మంత్రి మార్క్ మిల్లర్ తాజాగా ప్రకటించారు. ఈ ఏడాది గడువు తీరిపోతున్న స్టడీ పర్మిట్లకు సమానంగా కొత్త స్టడీ పర్మిట్లు మంజూరు చేయాలన్న విధానాన్ని ఎంచుకున్నట్టు ఆయన చెప్పారు. 2024లో కెనడా జారీచేయబోయే స్టడీ పర్మిట్ల సంఖ్య 3.64 లక్షలుగా ఉండబోతున్నదని చెప్పారు. అయితే ప్రైమరీ, సెకండరీ స్కూల్ స్టూడెంట్స్, మాస్టర్స్, డాక్టోరల్ డిగ్రీ విద్యార్థులకు ఈ పరిమితి నుంచి మినహాయింపు ఇచ్చినట్టు కెనడా తెలిపింది.

యూకేలో పీజీకి 10 లక్షల స్కాలర్‌షిప్

లండన్: ఇంగ్లండ్‌లో పీజీ చేయాలనుకుంటున్న భారతీయ విద్యార్థులకు రూ.10 లక్షల స్కాలర్‌షిప్ ఇస్తామని స్థానిక స్ట్రాత్‌క్లైడ్ యూనివర్సిటీ ప్రకటించింది. మలేషియా, థాయ్‌ల్యాండ్ విద్యార్థులకు కూడా స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్టు తెలిపింది. ఇంజినీరింగ్ విభాగంలో ఒక ఏడాది పీజీ కోర్సులో చేరే విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇస్తామని తెలిపింది. దరఖాస్తుదారులకు భారత్, మలేషియా, థాయ్‌ల్యాండ్ దేశాల పాస్‌పోర్టు ఉండాలని, మే 3వ తేదీ లోపు దరఖాస్తు చేయాలని పేర్కొన్నది.

'ఏడు' నంబర్ల కోసం రూ.7 కోట్లు

దుబాయ్: ఫ్యాన్సీ కారు నంబర్, మొబైల్ సిమ్ నంబర్లపై దుబాయ్‌లో శుక్రవారం నిర్వహించిన వేలం పాట అందరినీ అవాక్కయేలా చేసింది! యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్‌లో '7' అనే నంబర్‌కు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. 058-7777777 అనే మొబైల్ సిమ్ నంబర్ వేలం పాటలో రూ.7 కోట్లు ధర పలికింది. రూ.22 లక్షల వద్ద వేలంపాట మొదలైతే..కొన్ని సెకన్లలోనే కోట్లకు చేరుకుంది. మరో ఫ్యాన్సీ మొబైల్ సిమ్ నంబర్ 054-5555555 రూ.6.6 కోట్లకు అమ్ముడుపోయింది.

భారత్‌పై తగ్గనున్న ఎల్‌నినో ప్రభావం

న్యూఢిల్లీ: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి కొరతతో ఇబ్బందిపడుతున్న దేశ ప్రజలకు వాతావరణ శాస్త్రవేత్తలు కాస్త ఊరట కలిగించే వార్త చెప్పారు. ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో ఎల్‌నినో ప్రభావం తగ్గనుందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులు క్షీణించనున్నాయని, భారత్‌లో రుతు పవనాలకు అనుకూల పరిస్థితులు ఉండే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

పొద్దున్నే బ్రష్ చేసుకోకపోతే

పెద్దపేగు క్యాన్సర్!

- **నోటిలోని క్రిములే దీనికి కారణం**
- **అమెరికా పరిశోధకుల హెచ్చరిక**

న్యూయార్క్, ఏప్రిల్ 6: ఉదయాన్నే పళ్లు తోముకోకపోతే దుర్వాసనతో పాటు నోటికి సంబంధించిన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెప్తుంటారు. అయితే, ఇప్పుడు అమెరికాకు చెందిన పరిశోధకులు మరో కీలక విషయాన్ని వెల్లడించారు. ఉదయాన్నే బ్రష్ సరిగ్గా చేసుకోకపోతే పెద్దపేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫ్రెడ్ హట్చిన్‌సన్ క్యాన్సర్ కేంద్రానికి చెందిన పరిశోధకులు 200 మంది పెద్ద పేగు క్యాన్సర్ బాధితులపై జరిపిన అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.

ఇలా తెలిసింది

పెద్ద పేగు క్యాన్సర్ బాధితుల్లో ఉన్న సగం కణతుల్లో దంతాల్లో ఉండే సూక్ష్మజీవులు ఉన్నట్టు పరిశోధకులు గుర్తించారు. నోటిలో ఉండే సూక్ష్మజీవులు కడుపులోని కింది పేగుల వరకు ప్రయాణం చేయగలవని, పేగు లోపలి పొరలో క్యాన్సర్‌కు ఇవి కారణమవుతాయని నిర్ధారణకు వచ్చారు. పేగుల్లో ఉన్నట్టుగానే నోటిలో కూడా వివిధ రకాల బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వైరస్‌లు ఉంటాయని, దాదాపు 700 రకాల సూక్ష్మజీవులు నోటిలో ఉంటాయని పరిశోధకులు తెలిపారు. ప్రతిరోజూ సరిగ్గా బ్రష్ చేసుకోకపోతే ఇవి పెద్ద పేగుకు చేరుకొని క్యాన్సర్‌కు కారణమవుతాయని పేర్కొన్నారు.

యువతలోనూ పెరుగుతున్న ముప్పు

ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మరణాలకు కారణమవుతున్న క్యాన్సర్‌లలో ఇది రెండోది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 19 లక్షల మంది పెద్దపేగు క్యాన్సర్ బారిన పడగా, 9,30,000 మంది మరణించారని లెక్కలు చెప్తున్నాయి. ముఖ్యంగా 50 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిలో ఈ క్యాన్సర్ అభివృద్ధి చెందే ప్రమాదం ఉంటుంది. అయితే, గత 15 ఏండ్లుగా 20 - 49 ఏండ్ల వయస్సు వారు కూడా పెద్దపేగు క్యాన్సర్ బారిన పడటం ఏడాదికి 1.5 శాతం చొప్పున పెరుగుతున్నది.

బ్యాండేజీతో 'బ్యాండే'

- రోగ నిరోధక వ్యవస్థ బలహీనంతో క్యాన్సర్లు, సంతాన సమస్యల వరకూ అన్ని రకాల ఇబ్బందులు
- భారత మార్కెట్‌లోని బ్యాండేజీలోనూ ఈ కెమికల్స్.. తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూయార్క్, ఏప్రిల్ 6: ఆడుకొనేప్పుడు పిల్లల మోచేతికి గాయమైనా, కూరగాయలు తరిగేటప్పుడు చేతి వేలు గీసుకుపోయినా.. ముందుగా గుర్తొచ్చేది 'ఫస్ట్-ఎయిడ్' బాక్స్‌లో ఉన్న బ్యాండేజీనే. అయితే, గాయాలు తగ్గడం కోసం ఉపయోగించే ఈ బ్యాండేజీల వల్ల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉన్నదని తేలింది.

ఈ మేరకు హెల్త్ వెబ్‌సైట్ మమవేషన్, ఎన్విరాన్‌మెంట్, హెల్త్ న్యూస్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. పాలీఫ్లూరో ఆల్కైల్ సబ్‌స్టాన్సెస్ (పీఎఫ్ఏఎస్) అనే రసాయనాలు ఈ బ్యాండేజీలో ఉన్నట్టు తాము గుర్తించామని, వాతావరణంలో కరగనటువంటి ఈ కెమికల్స్‌తో ఆరోగ్య సమస్యలు పొంచి ఉన్నట్టు అధ్యయనకారులు వివరించారు.

పీఎఫ్ఏఎస్ రసాయనాలే కారణం

పీఎఫ్ఏఎస్‌లను శాశ్వత రసాయనాలు అని కూడా పిలుస్తారు. ఇవి వాతావరణంలో కరిగిపోవు, కలిసిపోవు. ఈ రసాయనాలు వాడిన బ్యాండేజీలను గాయాలపై అతికించినపుడు, ఈ రసాయనాలు మెల్లిగా శరీరంలోకి వెళ్లి, కరిగిపోకుండా, అనేక సంవత్సరాలపాటు నిలిచిపోతాయి. తద్వారా ఆరోగ్యానికి హాని చేస్తాయి.

ఏయే రోగాలొస్తాయంటే?

పీఎఫ్ఏఎస్ రసాయనాలు మన శరీరంలోని రోగ నిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. ఇన్ఫెక్షన్లపై పోరాడే సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. వ్యాక్సిన్లు ఇచ్చే ఫలితాలను తగ్గిస్తాయి. అంతేకాకుండా, బాలల గ్రహణ శక్తి, శారీరక, మానసిక వికాసంపై కూడా ప్రభావం చూపవచ్చు. సంతానోత్పత్తి సమస్యలకు దారి తీయవచ్చు. హార్మోనల్ సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు, ఆరోగ్య సమస్యలకు ఈ రసాయనాలకు సంబంధం ఉందని మరికొన్ని పరిశోధనలు చెప్తున్నాయి.

మరెందుకు వాడుతున్నారు?

పీఎఫ్ఏఎస్ రసాయనాలకు వాటర్‌ప్రూఫ్ లక్షణాలు ఉన్నాయి. వేడి, గ్రీజు, ఆయిల్, నీరు వంటివాటిని తట్టుకుని నిలవగలుగుతాయి. అందుకే వాటిని బ్యాండేజీల్లో వాడుతున్నారు. అధెహెసివ్స్, నాన్‌స్టిక్ కుక్‌వేర్, ఫుడ్ ప్యాకేజింగ్‌లలో కూడా ఈ రసాయనాలు కనిపిస్తాయి.

ఏయే బ్రాండ్లలో వాడుతున్నారు?

అధ్యయనంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా18 బ్రాండ్లకు చెందిన సుమారు 40 బ్యాండేజీలను పరీక్షించారు. 26 బ్యాండేజీల్లో పీఎఫ్ఏఎస్ స్థాయులు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నాయని బయటపడింది. భారత్‌లో ఎక్కువగా అమ్ముడుబోయే బ్యాండ్-ఎయిడ్, క్యూర్ యాడ్ బ్రాండ్లకు చెందిన బ్యాండేజీల్లోనూ పీఎఫ్ఏఎస్ రసాయనాలు వాడుతున్నట్టు అధ్య